సోనియా గాంధీ ఫెక్సీ వద్ద విద్యుత్ బిల్లులతో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ యూత్ నాయకులు

అమలు కాని హామీలతో మోసం

వనస్థలిపురం, జనవరి 25 : ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ 200ల యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా ఇస్తామని చెప్పి, ఇప్పటి వరకు అమలు చేయడం లేదని బీఆర్ఎస్ యూత్ జిల్లా ఇన్‌చార్జి మాధవరం నర్సింహా రావు అన్నారు. గురువారం బీఎన్‌రెడ్డినగర్‌లో సోనియా ఫ్లెక్సీకి విద్యుత్ బిల్లులు అందజేస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలు కాని హామీలను ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తోందన్నారు. దరఖాస్తుల పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. తమకు ఉచితంగా విద్యుత్ వస్తుందని ఆశపడ్డ ప్రజలకు మొండి చెయ్యి చూపుతున్నారన్నారు. కాంగ్రెస్ అధినాయకత్వం ఇచ్చిన హామీలకు కూడా దిక్కులేదని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే విధంగా ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దూసరి అరుణ్‌గౌడ్, మేకల శ్రీకాంత్, అంజన్‌రావు, నరేశ్‌గౌడ్, రాజవర్ధన్, వెంకటయ్య, శంకర్‌నాయక్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికే పెద్దపీట

- ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ
- గవర్నమెంట్ ప్రెస్ కాలనీలో కమ్యూనిటీ హాల్ ప్రారంభం

గవర్నమెంట్ ప్రెస్ కాలనీలో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్

సైదాబాద్, జనవరి 25 : ప్రజా సంక్షేమం, అభివృద్ధికి తాము అధిక ప్రాధాన్యత ఇస్తామని హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. గురువారం ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని గవర్నమెంట్ ప్రెస్ కాలనీలో నూతనంగా రూ. 54 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవాన్ని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుసేన్ మెరాజ్, ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్, డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ నిధులతో చేపట్టిన కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేశారని, ఈ భవనం కాలనీవాసులకు ఎంతో ఉపయోగకరంగా మారనుందన్నారు. కరోనా సమయంలో అభివృద్ధిలో కొంత వెనుకబడినప్పటికీ తర్వాత పెండింగ్ పనులను వేగవంతం చేశామన్నారు. ఎంపీ నిధులను అవసరమైతే విడుదల చేసి అభివృద్ధికి సహకరిస్తున్నామని తెలిపారు. ఎన్నికలతో సంబంధం లేకుండా అన్ని ప్రాంతాల అభివృద్ధియే లక్ష్యంగా తాను కృషి చేస్తానని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ, విద్యుత్, జలమండలి తదితర ఇతర విభాగాల అభివృద్ధి పనుల మంజూరును, వాటి నిధులను విడుదల చేయటానికి తాను సిద్ధంగా ఉన్నానని, వాటికి సంబంధించిన వివరాలను ప్రాంతాల వారీగా పనుల వివరాలను తనకు వెంటనే అందించాలని సూచించారు. స్థానిక అభివృద్ధి తన వంతు సహాయ సహకారాలను అందిస్తానని, ఐఎస్ సదన్ డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వంటి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. అభివృద్ధి పనుల శిలాఫలకంపై స్థానిక కార్పొరేటర్ పేరు ఉండే విధంగా అధికారులను ఆదేశిస్తానని, ఇటువంటి సమస్యలు మళ్లీ ఉత్పన్నం కాకుండా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడు తాము ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి పనులను కొనసాగిస్తామన్నారు. యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్, డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మాట్లాడుతూ స్థానికంగా నెలకొన్న వివిధ ప్రజా సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లి, వాటిని సత్వరమే పరిష్కరించే విధంగా చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్ రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

ఎల్బీనగర్ అందజేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు. జనవరి 25 : పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని మాదాపూరు గ్రామానికి చెందిన బాలయ్య అనారోగ్యానికి గురై దవాఖానలో చికిత్స పొందుతున్నారు. దవాఖాన ఖర్చులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కంద పెద్ద నర్సింహతో పాటు బాధితులు కలిసి కోరడంతో ఆమె తక్షణమే స్పందించి రూ. 4లక్షలు సీఎంఆర్ఎఫ్ (ఎల్వోసీ)ని వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ పేదలకు వరంలాంటిదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెగురైన వైద్యం అందించడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. పేదలకు ఈ పథకం ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని పేదలను గుర్తించి అన్ని విధాలుగా ఆదుకుంటానని వివరించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత

రోడ్డు ప్రమాదంలో గాయపడి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగోలు సాయినగర్‌కు చెందిన లక్ష్మీనాగరాజు చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ. 1.50 లక్షల ఎల్ఓసీ పత్రాన్ని గురువారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అందజేశారు.

–ఎల్బీనగర్, జనవరి 25

ఓటు హక్కు వజ్రాయుధంలాంటిది

మాట్లాడుతున్న కందుకూరు తహసీల్దారు గోపాల్

శ్రీ వెంకటేశ్వర కామర్స్ జూనియర్ కాలేజీలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు

బాలాపూర్ తాసీల్దార్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ మాధవిరెడ్డి

సైదాబాద్, జనవరి 25: భారత రాజ్యాంగం 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించిందని శ్రీ వెంకటేశ్వర కామర్స్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ గంధం వెంకటేశ్వర్లు అన్నారు. చంపాపేటలోని శ్రీ వెంకటేశ్వర కామర్స్ జూనియర్ కాలేజీలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిందని, యువత ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఓటర్లందరూ ఎన్నికలలో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును నిజాయితీగా వినియోగించుకోవాలన్నారు. యువత, మేధావులతో పాటు అన్ని వర్గాలవారు మేల్కొని ప్రజాస్వామ్యంలో ఎన్నికలు, ఓటు విలువ, మంచి ప్రభుత్వాల నిర్మాణంపై సరైన అవగాహన కలిగి ఉండి ప్రజాస్వామిక సమాజాన్ని స్థాపించాలని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు నాగేశ్వర్ రెడ్డి, సునీత, సన, రమణయ్య, శివరాం, లలిత తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

కందుకూరు, జనవరి 25 : ఓటు విలువ తెలుసుకొని విద్యార్థులు, యువత విజ్ఞతతో ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని కందుకూరు తహసీల్దారు గోపాల్ సూచించారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం తహసీల్దారు కార్యాలయం నుంచి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించిన అనంతరం హైదరాబాద్, శ్రీశైలం జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దారు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత ఎన్నికల్లో ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. నాయబ్ తహసీల్దారు తాజుద్దీన్ కందుకూరు పోలీస్ స్టేషన్ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్ఐ ప్రేమ్ కుమార్, ఎస్ఐ శ్రావణ్, రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బందితో పాటు వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదే విధంగా మండల పరిధిలోని 35 గ్రామ పంచాయతీలు అనుబంధ గ్రామాల్లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు.

బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో

బడంగ్‌పేట, జనవరి25: బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్నికలలో నిర్భయంగా ఓటు వేస్తామని అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. దేశంలో ప్రజాస్వామ్య సంప్రదాయాలను, స్వేచ్ఛయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికలకు సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ తహసీల్దార్ మాధవిరెడ్డి, డీటీ మణిపాల్ రెడ్డి, ప్రమోద్ రెడ్డి, మహేశ్, ఆర్ఐ ప్రశాంతి, జమీల్ షేక్, పుష్పలతా రెడ్డి, సలోమీ, సంధ్య, జూనియర్ అసిస్టెంట్, ,క్రిష్ణ మోహన్, పృథ్వీ,రాజు , ఎల్లేశ్ పాల్గొన్నారు.

అనాథ విద్యార్థుల సేవే లక్ష్యం

ఆర్కేపురం, జనవరి 25 : అనాథ, పేద, మధ్యతరగతి విద్యార్థుల సేవే లక్ష్యంగా వాసవీ క్లబ్ హైదరాబాద్ పనిచేస్తుందని క్లబ్ అధ్యక్షుడు ఉప్పల వరకుమార్‌గుప్త, ప్రధాన కార్యదర్శి మంచాల అంబరీక్ష, కార్యదర్శి అడ్డగుల్లా వెంకటేశ్ అన్నారు. గురువారం వాసవీ క్లబ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ డివిజన్‌లోని ఆదరణ అనాథ ఆశ్రమంలోని విద్యార్థులకు పది రైస్ బస్తాలతో పాటు నిత్యావసరాల సరుకులను అందజేశారు. వారు మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష ఆశించకుండా ఎంతో మంది అనాథ విద్యార్థులను చేరదీసి వారి బంగారు భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆదరణ ఫౌండేషన్ చైర్మన్ జాడి మాధవరావు, జాడి పూజ తదితరులు ఉన్నారు.

అనాథ విద్యార్థులకు రైస్ బ్యాగ్స్ అందజేస్తున్న వాసవీ క్లబ్ హైదరాబాద్ ప్రతినిధులు

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి

కందుకూరు. జనవరి 25 : రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని కందుకూరు పోలీస్ స్టేషన్ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం రాత్రి మండల పరిధిలోని కొత్తగూడ గ్రామంలో యువకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ యువకులు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వాహనాలను నడిపితే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్లలో వెళ్లేటప్పుడు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కొత్తగూడలో మాట్లాడుతున్న సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి

రెండు బైక్‌లు ఢీ.. నలుగురికి తీవ్ర గాయాలు

మలక్‌పేట, జనవరి 25: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూసారాంబాగ్ చౌరస్తాలో అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ నవీన్ కథనం ప్రకారం.. కర్మన్‌ఘాట్‌కు చెందిన అభినయ్ తన మిత్రుడు సంతోష్‌రెడ్డితో కలిసి స్కూటీపై బుధవారం రాత్రి దిల్‌సుఖ్‌నగర్ నుంచి నల్గొండ చౌరస్తా వైపు వెళ్తుండగా, మూసారాంబాగ్ చౌరస్తావద్ద మరో ద్విచక్ర వాహనంపై రాంగ్ రూట్‌లో అతి వేగంగా వచ్చి ఇద్దరు మైనర్లు స్కూటీని బలంగా ఢీ కొట్టారు. తీవ్ర గాయాలైన నలుగురిలో అభినయ్, సంతోష్‌రెడ్డిలను చికిత్స నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించగా, వారి కుటుంబ సభ్యులు నాంపల్లి కేర్ దవాఖానలో చేర్పించారు. ఇద్దరు మైనర్లను మలక్‌పేటలోని యశోద దవాఖానలో చేర్పించారు. నలుగురి పరిస్థితి విషమంగానే ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

మైనారిటీ గురుకులాలను వినియోగించుకోవాలి

మాదన్నపేట, జనవరి 25: మాదన్నపేట ధోబిఘాట్ వద్ద ఉన్న సనత్‌నగర్ బాయ్స్-1 గురుకుల పాఠశాలను మైనార్టీలు సద్వినియోగం చేసుకోవాలని యాకుత్‌పుర నియోజకవర్గం ఎమ్మెల్యే మెరాజ్ జాఫర్ హుసేన్ కోరారు. గురువారం మైనార్టీ గురుకులాల ప్రవేశ దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించారు. కళాశాల నందు (2024-2025) విద్యా సంవత్సరానికి దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ డా.అరుంధతి తెలిపారు. ఈ నెల 18 వ తేదీ నుంచి ఫిబ్రవరి 6 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మెరాజ్ హుస్సేన్

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

బాలాజీనగర్‌కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, జనవరి 25: కాలనీల్లో గుంతలమయంగా మారిన రోడ్లను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి పద్మావతికాలనీ, రాగాల ఎన్‌క్లేవ్, బాలాజీనగర్, మధురానగర్‌కాలనీల్లో రూ. 55 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పునరుద్ధరణ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. దశలవారీగా కాలనీల్లో అభివృద్ధి పనులను చేపట్టి ప్రజలకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు దుర్గంపూడి సాంబిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, మహేంద్రనాథ్, పద్మారెడ్డి, భాస్కరాచారి, యాదగిరి, మధుసూదన్‌రావు, దశరథ్, లింగారెడ్డి, సువర్ణ, మల్లీశ్వరి, గౌరిప్రియ పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కార్పొరేటర్ లచ్చిరెడ్డి, మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్నలను సన్మానిస్తున్న కాలనీవాసులు

వనస్థలిపురం, జనవరి 25 : డివిజన్‌లో నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గురువారం డివిజన్‌లోని గాయత్రీనగర్ బ్యాంకు కాలనీలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆలస్యం కాకుండా త్వరితగతిన ముగించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కాలనీల్లో ఉన్న అన్ని సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో చేపడుతామన్నారు. కాలనీవాసులు తమ దృష్టికి తీసుకువచ్చిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాగా డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న కూడా డ్రైనేజీ పనులను పరిశీలించారు. పనుల తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షురాలు సరస్వతి, ప్రధాన కార్యదర్శి ఉపేందర్, ఉపాధ్యక్షుడు రవీందర్‌గుప్త, మధు, రమేశ్, మనోహర్, భిక్షమయ్య, లక్ష్మి పతి, శేఖర్, అంజిరెడ్డి, యాదిరెడ్డి, బాలకృష్ణ, పద్మ, వాణి, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ పట్టా పొందిన జగదీశ్వర్

మన్సూరాబాద్, జనవరి 25: ఎల్బీనగర్‌కు చెందిన జగదీశ్వర్ కందుల మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. 'ప్రయోగాత్మక, సంఖ్యా విధానమైన కావిటేటింగ్ ఫ్లో పాస్ట్ యాక్సిసిమెట్రిక్ బాడీస్' అనే అంశంపై జగదీశ్వర్ పరిశోధన చేసి థీసిస్‌ను సమర్పించినందుకు గాను పీహెచ్‌డీ పట్టాను పొందినట్లు తెలిపారు. ఓయూ ప్రొఫెసర్ ఉషాశ్రీ, సీబీఐటీ ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి తదితరుల సహకారంతో పీహెచ్‌డీ సాధించినట్లు పేర్కొన్నారు. నల్గొండ జిల్లా, మునుగోడు మండలం కోతులారం గ్రామానికి చెందిన నర్సింహ, రాములమ్మ దంపతుల కుమారుడైన జగదీశ్వర్ సాధారణ వ్యవసాయ కుటుంబం. జగదీశ్వర్ కందులను పలువురు అభినందించారు.

ధ్యానాంజనేయ స్వామి ఆలయ హుండీ లెక్కింపు

చంపాపేట, జనవరి25: ధ్యానాంజనేయ స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ. 40,71,412 లక్షలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాస శర్మ తెలిపారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయ స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం దేవాదాయ శాఖ రంగారెడ్డి జిల్లా సహాయ కమిషనర్ శేఖర్ పర్యవేక్షణలో ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో ఆలయ పాలక మండలి చైర్మన్ నల్ల రఘుమారెడ్డితో కలిసి 132 రోజులకు గాను వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు.

స్వాముల సన్నిధానానికి షెడ్డు నిర్మాణం

ఆర్కేపురం, జనవరి 25 : ఎల్బీనగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శివ శక్తి సేవా సమితి ఆధ్వర్యంలో కొన్ని సంవత్సరాలుగా శివ స్వాములు మూలధారణ ధరించి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఉంటున్నారు. సన్నిధానం లేదనే విషయం తెలుసుకున్న సామాజిక సేవా వేత్త చిలుక ఉపేందర్‌రెడ్డి శివ స్వాముల సన్నిధానానికి తన సొంత డబ్బులతో షెడ్డు నిర్మాణం, ఫ్లోరింగ్ కూడా సిద్ధం చేసి వారు పూజలు చేసుకొని ఉండటానికి అనుకూలంగా చేయించారు.

యోగా శిక్షణ తరగతులు ప్రారంభం

ఎల్బీనగర్, జనవరి 25 : దిల్‌సుఖ్‌నగర్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో శ్రీ సత్యసాయి ధ్యాన మండలి ఆధ్వర్యంలో ఉచితంగా అంతర్ముఖ యోగా శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ యోగా శిక్షణ తరగతులను తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, భిక్షమయ్య గురూజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ లయన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, కోఆర్డినేటర్ ఇస్మాయిల్ గుజ్జీ, భావన శ్రీనివాస్, వేణుమాధవ్, రామచంద్రరావు, సంపత్ గురుజీ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, భిక్షమయ్య గురూజీ

రాక్ గార్డెన్స్‌లో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు

ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న జీఎస్ఐ సధరన్ రీజియన్ హెడ్ సీహెచ్ వెంకటేశ్వర్‌రావు

ఎల్బీనగర్, నాగోల్ బండ్లగూడ జీఎస్ఐలోని రాక్‌గార్డెన్స్ ప్లాంట్‌లో గురువారం సామ్రాట్ అశోక్ ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. జీఎస్ఐ సధరన్ రీజియన్ హెడ్ సీహెచ్ వెంకటేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశాన్ని చాలా ఏండ్ల పాటు పరిపాలించిన సామ్రాట్ అశోక్ జీవిత చరిత్రను తెలియ చెప్పే విధంగా ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఎల్‌పీ సింగ్, ఎంఎల్ దొర, హెచ్‌ఎం మిశ్రా, జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఆదర్ల మహేశ్, కార్యదర్శి మధిర సత్యనారాయణ, చక్రేశ్వర్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

మన్సూరాబాద్, జనవరి 25: జీఎస్ఐ సధరన్ రీజియన్ ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ సహకారంతో

పేద విద్యార్థులను ఆదుకోవాలి

విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేసిన దాతలతో హెచ్ఎం చంద్రమోహన్‌రెడ్డి

కందుకూరు. జనవరి 25 : పేద విద్యార్థులను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని మీర్‌ఖాన్‌పేట్ ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. రూ.25వేల విలువ గల 200 మందికి దాతలు చిన్న నర్సింహ, కంబాలపల్లి మదన్‌పాల్ రెడ్డి, మద్ది శ్యామ్‌సుందర్, వంగూరి వెంకటేశ్, శ్రీశైలం యాదవ్ ఉచితంగా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. మధుసూదన్ యాదవ్, నరేశ్, వెంకటేశ్, రాఘవేందర్, శ్రీకాంత్, వినోద్, ఉపాధ్యాయులు కుమార్, శ్రీనివాసులు, హరిప్రసాద్, శ్రీధర్, రాఘవేందర్ పాల్గొన్నారు.

ఆడ పిల్లలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో వినీతా దేవి

బడంగ్‌పేట, జనవరి25: దేశంలో రోజు రోజుకు ఆడ పిల్లల సంఖ్య తగ్గిపోతుందని హైయత్ నగర్ ప్రాజెక్టు డైరెక్టర్ (సీడీపీవో) వినీతా దేవి అన్నారు. సరూర్‌నగర్ మండల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన భేటీ బచావో, భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, పాటల పోటీలు, ఉపన్యాసాల పోటీలు నిర్వహించారు. విజేతలైన తొమ్మిది మంది విద్యార్థులకు సీడీపీవో వినీతా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆడ పిల్లలను అన్ని రంగాల్లో ప్రోత్సహించ వలసిన అవసరం ఉందన్నారు. సమాజంలో ఉన్న లింగ వివక్షను అధిగ మించాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించినప్పుడే విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత బయటపడుతుందన్నారు. బీఆర్‌బీ కోఆర్డినేటర్ హర్షవర్ధిని, సూపర్ వైజర్లు సావిత్రి, నారాయణమ్మ, గీత, విజయ భాస్కర్, ప్రమీల, శ్రీకాంత్, ప్రవంతి, కవిత, యాదగిరి పాల్గొన్నారు.

ఝాన్సీ పై దాడి హేయమైన చర్య

ఝాన్సీని పరామర్శిస్తున్న బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, రాధాధీరజ్‌రెడ్డి

ఆర్కేపురం, జనవరి 25: అగ్రికల్చర్ యూనివర్సిటీ భూముల రక్షణ కోసం నిరసన చేస్తున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి, నాయకులపై పోలీసుల దాడిని బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి ఖండించారు. పోలీసుల దాడిలో గాయపడి ఓజోన్ దవాఖానలో చికిత్స పొందుతున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీని గురువారం శిల్పారెడ్డి, కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డితో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఝాన్సీపై పోలీసులు చేసిన దాడి హేయమైన చర్య అని, ఓ మహిళపై వారి ప్రవర్తన సహేతుకంగా లేదన్నారు. యూనివర్సిటీ విద్యార్థుల స్థలంలో హైకోర్టు ఏర్పాటును వ్యతిరేకించడం విద్యార్థి సంఘాలు, నాయకుల బాధ్యత అని, దాడిచేసిన వారిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఝాన్సీ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు
SHRI KRISHNA MEDICAL & GENERAL STORES
Chemists & Druggists
మిత్రులకు, శ్రేయోభిలాషులకు
మరియు మా విలువైన కస్